క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

బంగారుపాళెం: మండలంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు శనివారం పర్యటించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, జిల్లా రైతు సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఉదయం 10 గంటలకు కరిడివారిపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్‌చేయనున్నట్లు చెప్పారు. తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం వద్ద ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసంలో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని గిరింపేటలో ఉన్న దేవి పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆ పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ ఆషాడ బహుళ పంచమిని పురస్కరించుకుని అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఏటా తమ పాఠశాల విద్యార్థులకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భార్గవి, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

శ్రీవాసవీ కన్యాకపరమేశ్వరి కుంభాభిషేక పూజలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం బజారువీధిలోని శ్రీ కన్యాక పరమేశ్వరి ఆలయ మహా కుంభాభిషేక పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి హోమ పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరింపించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ పెద్దలు ఆయనను ఘనంగా సన్మానించారు.

టీడీపీ అసెంబ్లీ టికెట్ నాకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజి

చిత్తూరు రూరల్: టీడీపీ చిత్తూరు అసెంబ్లీ టికెట్‌ను దివ్యాంగుడైన తనకే కేటాయించాలని జంగాలపల్లెకు చెందిన ఎ.బాలాజీ డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిత్తూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి స్థానాన్ని దివ్యాంగులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాజమాణిక్యం, సోమశేఖర్ రెడ్డి, బాబునాయుడు, మురుగేష్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవల్లి సూపర్ మార్కెట్ ప్రారంభం



చిత్తూరు రూరల్: చిత్తూరు–పుత్తూరు రోడ్డులో శుక్రవారం శ్రీవల్లి సూపర్ మార్కెట్ ప్రారంభమైంది. కార్పొరేటర్ హరిణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్‌ను ప్రారంభించారు. అన్ని రకాల వస్తువులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు పట్టాభిరెడ్డి పేర్కొన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ బదిలీల సమస్యలను కలెక్టర్ షణ్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ సంఘం సభ్యులు బాలాజి, గిరీష్మా శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బదిలీల్లో పీహెచ్, ఒంటరి మహిళ, స్పౌజ్, మెడికల్ కేటగిరీలకు ఆమోదం తెలపాలన్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

బలిజల సంక్షేమానికి కృషి

చిత్తూరు కార్పొరేషన్: బలిజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో బలిజ సంఘం నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగ్గిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందన్నారు. బలిజల కలగా మారిన కాపుభవన్ నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రహరీగోడ నిర్మించినట్లు గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒకరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, రెడ్డెప్ప, వినాయకబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ

చిత్తూరు రూరల్: నగరంలోని గాంధీ విగ్రహం కూడలిలో శుక్రవారం లైన్స్‌క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. దీనికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో చైర్మన్ నరేష్‌బాబు, సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుబాబు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇదే కదా గ్రామ స్వరాజ్యం

- మండలానికి 19 సచివాలయాలు
- అన్ని రకాల సేవలు ముంగిట్లోనే
- నూతన భవనాలతో గ్రామాలకు కొత్త శోభ



ఐరాల సచివాలయంలో ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగులు

ఐరాల: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో సాకారమైంది. పల్లెకు సచివాలయ పాలన వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారు. వేల రూ.కోట్లతో కార్యాలయాల భవనాలు నిర్మించారు. నూతన భవనాలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. 545 రకాల సేవలందిస్తున్న అధికార పాలనా యంత్రాంగం ప్రజల మన్ననలను అందుకుంటోంది.

సచివాలయాల నిర్మాణం ఇలా..

మండలానికి 19 సచివాలయాలకు భవనాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క సచివాలయానికి ప్రభుత్వం రూ.40 లక్షలు వెచ్చించింది. ఇందులో 10 భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన 9 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటితో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.23 లక్షలు, పాల కేంద్రానికి రూ.14 లక్షలు చొప్పున ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయ పరిధిలో సుమారు రూ.95 లక్షలు వెచ్చించింది.

సమస్యలకు సత్వర పరిష్కారం

సచివాలయంలో జనన, మరణ, వివాహ సర్టిఫికెట్లను ప్రజలు సులభంగా పొందుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లయిస్, హెల్త్ , ఫ్యామిలీ వెల్ఫేర్, హౌసింగ్, ఆధార్ సేవల కోసం దరఖాస్తు చేసినవారికి నిర్దేశించిన సమయానికి ధ్రువ పత్రాలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన ప్రయాస తప్పిపోయింది. ఊరిలోనే, ఇంటికే వలంటీరు వచ్చి పథకానికి అర్హత ఏంటి, ఏ పథకం వర్తిస్తుంది తదితర విషయాలను వివరించి, వారే ప్రజల చేత దరఖాస్తు చేయిస్తున్నారు.

మండలంలో సచివాలయ వ్యవస్థ వివరాలు	
సచివాలయాలు	19
గ్రామ పంచాయతీలు	28
గ్రామాలు	248
వలంటీర్ల సంఖ్య	265
సచివాలయ సిబ్బంది	156
సచివాలయాల్లో అందిస్తున్న సేవల సంఖ్య	545

గడప దాటకుండానే..

గడప దాటాల్సిన పనిలేకుండా పింఛన్లు, రేషన్, ఇంటి వద్దకే అందుతున్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి వలంటీర్లే అవసరమైన దరఖాస్తులు సేకరిస్తారు. పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్‌కు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం అధికారులు పరిశీలించి అర్హత ఉంటే వెంటనే ఆమోదిస్తున్నారు.

దళారులు.. అవినీతికి చెక్

ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే ప్రజలు ఎన్నో కష్టాలు పడేవారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి సేవలను పొందాలన్నా దళారులను ఆశ్రయించి ఎంతో కొంత తప్పనిసరిగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ రాకతో అటువంటి ఇబ్బందులు తొలగిపోయాయి. సచివాలయాల్లో అందుతున్న సేవల పట్ల ప్రజలు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్రస్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.

సేవలు బాగున్నాయి



సచివాలయ సేవలు బాగున్నాయి. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే సేవలు అందుతున్నాయి. ఆధార్ అప్‌డేషన్ సచివాలయంలో నిముషాల వ్యవధిలోనే పూర్తయింది. గతంలో క్యూలో నిల్చుని అతికష్టం మీద ఆధార్ తీసుకున్నాను. ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదు. – దిల్‌షాద్, ఐరాల

ఇంటింటికీ వస్తున్నారు



నా మనవడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత సచివాలయాలు పెట్టి మా కష్టాలు తీర్చారు. ఏ పని అయినా సచివాలయానికి వెళ్లి చేసుకుంటున్నాం. పథకాల మంజూరు కోసం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరిస్తున్నారు.
– గోవిందయ్య, చిన్నవెంకటంపల్లె, ఐరాల

సిఫార్సు లేకుండానే..



నేను సచివాలయంలో రైతు భరోసాకు దరఖాస్తు చేసి రైతు భరోసా సాయాన్ని అందుకున్నాను. దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి సిఫార్సు లేకుండానే వెంటనే మంజూరు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
– జగన్నాథయ్య, సీవీ పల్లె, ఐరాల

పథకాలు అందించడమే ధ్యేయం



ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సచివాలయ వ్యవస్థ రాకతో అన్ని రకాల సేవలు ప్రజల చెంతకే అందుబాటులో వచ్చాయి. సంక్షేమ పథకాలు గడప వద్దకే అందుతున్నాయి.
– నాగరాజు, ఎంపీడీఓ, ఐరాల



పుల్లూరు గ్రామ సచివాలయం

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య
వైఎస్సార్ పెన్షన్ కానుక	9428	వైఎస్సార్ ఈబీసీ నేస్తం	221
వైఎస్సార్ చేయూత	2604	జగనన్న వసతి దీవెన	1112
వైఎస్సార్ ఆసరా	10883	జగనన్న విద్యాదీవెన	1118
వైఎస్సార్ సున్నా వడ్డీ	11500	జగనన్న చేదోడు	212
వైఎస్సార్ రైతు భరోసా	9738	జగనన్న తోడు	336
వైఎస్సార్ వాహన మిత్ర	166	అమ్మఒడి	3446

నేడు వైఎస్సార్ జయంతి

చిత్తూరు కార్పొరేషన్: దివంగత నేత వైఎస్సార్ జయంతి వేడుకలను శనివారం నగరంలో నిర్వహించనున్నారు. ఉదయం స్థానిక డీసీసీబీలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పార్టీ నాయకులతో కలిసి నివాళి అర్పించనున్నారు. అనంతరం గాంధీ సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు.

గుడిపాలలో కేక్ కటింగ్

గుడిపాల: వైఎస్సార్ జయంతి సందర్భంగా శనివారం ఉదయం మండల కేంద్రంలో కేక్ కటింగ్ నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రసాద్ రెడ్డి శుక్రవారం తెలిపారు. రైతు దినోత్సవం కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని మహానేత విగ్రహం వద్ద శనివారం ఉదయం జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ బుజ్జిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తవణంపల్లె: మండలకేంద్రంలోని వైఎస్సార్ విగ్రవం వద్ద నివాళి అర్పించనున్నట్లు ఎంపీపీ గీతారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణా రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హరి రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో దారి సమస్య పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుడిపాల: ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న శ్మశానానికి దారి సమస్య చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చొరవతో పరిష్కారమైంది. మండలంలోని చీలాపల్లె గ్రామంలో కొన్నేళ్లుగా శ్మశానం వద్ద దారి సమస్య ఉండేది. శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చీలాపల్లె గ్రామానికి వెళ్లి పట్టా భూములకు సంబంధించి రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ రజినీకాంత్, నాయకులు రమణ, యోవాన్, వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం



గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రష్మిత



ఎగువ తవణంపల్లెలో..



ఐరాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. నంగమంగళం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 65 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే వైద్య సేవలను అందించారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలత, శాంతకుమారి, యమున, వరలక్ష్మి, రూబి తదితరులు పాల్గొన్నారు.

అనూహ్య స్పందన

తవణంపల్లె: మండలంలోని ఎగువ మత్యం, ఎగువ తవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. ఎగువ మత్యంలో డాక్టర్ వినయ్‌కుమార్, ఎగువ తవణంపల్లెలో డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 127 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు హరి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు ఝాన్సీ, భార్గవి, ఏఎన్‌ఎంలు తులసమ్మ, శ్రీదేవి, డీఈఓలు విజయలక్ష్మి, మహేష్, ఆశావర్కర్లు ధనమ్మ, నరసమ్మ, రేణుక, లక్ష్మి, అశ్వని పాల్గొన్నారు.

మొరంపల్లెలో...

ఐరాల: మండలంలోని మొరంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందించారు. వారికి ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు



బహుమతి అందుకున్న విద్యార్థులతో డీఈవో విజయేంద్రరావు

పూతలపట్టు: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూతలపట్టు రవిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యం తరపున 2023 పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. 9మంది విద్యార్థులకు గాను మొదటి స్థానానికి రూ.5000, రెండవ స్థానానికి 3000, మూడవ స్థానానికి 2000 రూపాయలు అందజేశారు. దీనికి హాజరైన డీఈవో విజయేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి, చదువుకున్న పాఠశాలకు అభివృద్ధి పరంగా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ కృష్ణారెడ్డి, ఐరాల ఎంఈఓ–2 దామోదరనాయుడు, పాఠశాల మాజీ కమిటీ చైర్మన్ చిరంజీవి రెడ్డి, రామ్మూర్తి రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య ప్రభపై కోదండరాముడి విహారం



టి.పుత్తూరు కోదండరామాలయంలో స్వామికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న కోదండరామస్వామి

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో శుక్రవారం రాత్రి సూర్యప్రభ వాహనంపై శ్రీ కోదండరాముడు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అర్చకులు ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదారులు భక్తిప్రపత్తులతో స్వామికి సుప్రభాతం, తిరుమంజనం, పాలాభిషేకం చేయించి దీపధూప నైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఆలయంలో ఉభయదారులచే స్వామికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, వివిధ రకాల పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేకం పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. శనివారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రిలో చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు శంకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్తులు తెలిపారు.

11 రకాల సేవలకు 'సురక్ష'



చిత్తూరు : మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: జగనన్న సురక్ష ద్వారా అర్హులకు 11 రకాల సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరు నగరంలోని 3వడివజన్‌లో వార్డు సచివాయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పలువురు అర్హులకు వివిధ రకాల పత్రాలను అందజేశారు. టీడీపీ పాలనలో ఏ ప్రభుత్వ పథకమైనా అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే వచ్చేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమల్లోకి వచ్చాక అర్హతే ఆధారంగా పార్టీలు, కుల మతాలకు అతీతంగా పథఖాలు అందుతున్నాయని గుర్తుచేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఈ సేవలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారున. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్, కార్పొరేటర్లు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

45 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేట సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 45 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంతో సంక్షేమ పథకాలు, వివిధ రకాల పత్రాలను ప్రజలకు ఇబ్బంది లేకుండా అందించే ప్రక్రియను చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ త్యాగరాజులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

561 మందికి ధ్రువపత్రాలు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలు అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిటిపిరాళ్ల, పోటుకనుమ పంచాయతీలలో శుక్రవారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. చిటిపిరాళ్ల పంచాయతీలో 333, పోటుకనుమ పంచాయతీలో 228 సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఈడీ నరసింహులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, సింగిల్ విండోఅధ్యక్షులు దొరస్వామిరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, అమర్‌నాథరెడ్డి, ఎంపీటీసీ చైతన్య, సర్పంచ్ బాబు నాయుడు, ప్రవీణ్, నిరంజన్‌రెడ్డి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, పట్టాభి రెడ్డి, ఎంఎస్ మణి, షణ్ముగం, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధగుట్టపల్లె సచివాలయంలో..

యాదమరి: మండలంలోని బోధగుట్టపల్లె సచివాలయంలో జగనన్న సురక్ష పథకంలో 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ అందించారు. మండలంలోని శుక్రవారం ఉదయం బోధగుట్టపల్లె సచివాలయ పరిధిలో గ్రామీణులకు జగనన్న సురక్ష పథకంపై సమావేశం ఏర్పాటు చేశారు. వలంటీర్ల ద్వారా అందిన అర్జీల ప్రకారం లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు ఉచితంగా అందించారు.



చిత్తూరు: ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ



పూతలపట్టు: సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు



యాదమరి: సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

నిస్వార్థ సేవలందిస్తున్న లయన్స్ క్లబ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు గోల్డ్ సేవల్లో ఎలాంటి స్వార్థం లేదని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. నగరంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం ఆ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షులుగా శ్రీధర్, కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా జమీర్ ప్రమాణస్వీకారం చేశారు. దీనికి హాజరైన విజయానందరెడ్డి మాట్లాడుతూ నగరంలో కొన్నేళ్లుగా లయన్స్ క్లబ్ వారు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారికి తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ నరేష్‌బాబు, సభ్యులు భానుమూర్తిరెడ్డి, చంద్రారెడ్డి, నారాయణస్వామి, సుదర్శన్‌రెడ్డి, మధుబాబు పాల్గొన్నారు.